




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 322, పేజీలు - 08

మంగళవారం, మే 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# చట్టం ముందు ఎవరూ అధికులు కారు

## - బండి భగీరథ్ అంశంపై సీఎం సీరియస్



- బండి భగీరథ్ కుమారుడి పోక్సో కేసు
- 8న ఫిర్యాదు వస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్న
- విచారణకు స్పెషల్ టీం ఏర్పాటు చేయాలని ఆదేశం
- కేసు వివరాలను సీఎంకు వివరించిన డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో భిన్నంగా స్పందించారు. ఈ కేసు విచారణ తీరుపై మంగళవారం మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్-చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ కేసును తాను స్వయంగా డీజీపీ ,ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించినట్లు సీఎం తెలిపారు.

### కేసు ఆలస్యానికి కారణం

మే 8వ తేదీనే పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే, మే 9, 10 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన ఉండటంతో సుమారు 10 వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారని రేవంత్ గుర్తు చేశారు. డీజీపీ నుండి కింది స్థాయి అధికారి వరకు అందరూ పీఎం సెక్యూరిటీలో ఉండటం వల్లే విచారణలో స్వల్ప జాప్యం జరిగిందని, ఇప్పుడు దర్యాప్తు వేగవంతమైందని స్పష్టం చేశారు.

### మహిళా ఆఫీసర్ నేతృత్వంలో విచారణ

ఈ కేసు అత్యంత సున్నితమైనది, మైనర్ బాలికకు సంబంధించినది కావడంతో, దీనిని ఒక సీనియర్ మహిళా పోలీస్ అధికారికి అప్పగించాలని సీఎం డీజీపీని ఆదేశించారు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిందితులు ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదు చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని రేవంత్ స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ నేతలకు సీఎం కౌంటర్

బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలపై రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియా ముందు మాట్లాడినంత మాత్రాన విచారణలు జరగవు. కేటీఆర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఖాళీగా ఉన్నారని దర్యాప్తు అధికారులుగా వ్యవహరిస్తామంటే కుదరదు అని ఎద్దేవా చేశారు. రిటైర్డ్ పోలీస్ అధికారి అయిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కు

2లో..

# స్టాలిన్‌తో సీఎం విజయ్ భేటీ

## - తమిళ రాజకీయాల్లో కొత్త విలువలు




చెన్నై (ప్రశ్న న్యూస్) శాసనసభ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడు రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఈ ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినా సాధారణ మెజార్టీకి అవసరమైన సంఖ్యాబలం సాధించలేకపోయింది. దీంతో చిన్న చిన్న పార్టీల మద్దతు కూడగట్టుకోడానికి దళపతి విజయ్ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ఆయన నాలుగుసార్లు గవర్నర్‌ను కలవాల్సి వచ్చింది. అన్ని అడ్డంకులను దాటుకుని చివరకు ముఖ్యమంత్రిగా విజయ్ ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ నివాసానికి సీఎం విజయ్ సోమవారం మధ్యాహ్నం వెళ్లడం ఆసక్తి రేపుతోంది. తమ నివాసానికి వచ్చిన విజయ్‌కు స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ఎదురొచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఆయనను ఆలింగనం చేసుకుని లోపలికి తీసుకెళ్లారు. అనంతం ఎంకే స్టాలిన్‌తో భేటీ కాగా ఈ సందర్భంగా విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ భేటీలో విజయ్, ఎంకే స్టాలిన్‌తో పాటు ఉదయనిధి కూడా

2లో..

# ప్రధాని మోదీ ఏడు సూత్రాలు ఒక జాతీయ మిషన్

## ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్న సీఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలను బలోపేతం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన ఏడు విజ్ఞప్తులు జాతీయ మిషన్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ వార్షిక వ్యాపార సదస్సులో ఆయన ప్రసంగిస్తూ మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ప్రతి భారతీయుడు ఈ పిలుపును ఒక బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

### సంక్షోభ సమయంలో స్వావలంబనే మార్గం

ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు భారతదేశం తన వనరులను పొదుపు చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంధనం, ఎరువుల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని చేసిన సూచనలను ఆయన సమర్థించారు. ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్న తరుణంలో, యుద్ధంతో నేరుగా సంబంధం లేని దేశాలు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో పొదుపు మంత్రమే మనల్ని కాపాడుతుంది అని ఆయన వ్యాఖ్యానించారు.

**- చంద్రబాబు సమర్థించిన ప్రధాని చెప్పిన ఏడు సూత్రాలు**

2లో..

# బండి భగీరథ్ కేసుతో బీజేపీకి సంబంధం లేదు

- చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టీకరణ
- ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని వ్యాఖ్య
- బండి సంజయ్ కుటుంబ ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్న బీజేపీ చీఫ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ వ్యవహారంలో తెలంగాణ సర్కార్ సీరియస్ అయిన సంగతి తెలిసిందే. వెంటనే ఈ ఘటనపై చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారింది. అయితే మే 8వ తేదీనే బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చినా పోలీసులు ఎందుకు చర్యలు చేపట్టలేదని సీఎం నిలదీశారు. ఈ క్రమంలోనే

2లో..



2లో..

# మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

## - పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది. పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు,

2లో..

# విభజన హామీలు, పెండింగ్ నిధులు

## - ఢిల్లీలో గట్టిగా గళం వినిపించిన సీఎం చంద్రబాబు

- కేంద్ర మంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌తో భేటీ
- 2027 నాటికి పోలవరం పూర్తి చేసేందుకు సహకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- 'హర్ ఖేత్ కో పానీ' పథకం కింద రూ.285 కోట్లు విడుదల చేయాలని అభ్యర్థన

అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, పెండింగ్ నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర

2లో..




# టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్లే పది తర్వాత డ్రాప్‌అవుట్లు

## - విద్యావారోత్సవాల కార్యక్రమంలో సీఎం రేవంత్

- విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి ఫిన్‌లాండ్ పంపించాం
- అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామన్న సీఎం
- విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్న సీఎం రేవంత్ రెడ్డి
- అందుకే విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్నానని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తుండగా.. తాజాగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. చదువు ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని అందుకే తెలంగాణ విద్యా శాఖను మంత్రులకు కేటాయించకుండా తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే సమయంలో చదువును మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు

2లో..

# మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- ఆరుగురు సభ్యులను నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా కమిషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు సభ్యులతో కూడిన మహిళా కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా అసాయి షకిరాను

2లో..

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

## - అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



సోమనాథ్ (ప్రశ్న న్యూస్) భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో

2లో..

# చికెన్ ధరలకు రెక్కలు

## - కిలో రూ.350 దాటిన ధర



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలుగు రాష్ట్రాల్లో నాన్‌వెజ్ ప్రియులకు చికెన్ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వేసవి తాపం ఒకవైపు, వేడుకల సీజన్ మరోవైపు వెరసి చికెన్ రేట్లకు రెక్కలొచ్చాయి. సామాన్యుడికి అందుబాటులో ఉండే మాంసాహారం కాస్తా ఇప్పుడు ప్రీమియం ఐటమ్‌గా మారిపోయింది. గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు అనూహ్యంగా పెరిగాయి. కిలో చికెన్ ధర సాధారణంగా రూ. 200 నుండి రూ. 220 మధ్య ఉండాల్సింది పోయి, ప్రస్తుతం రూ. 320 నుండి రూ. 380 వరకు స్కిన్‌లెస్ పలుకుతోంది. కొన్ని చోట్ల నాటు కోడి ధరలు కిలోకు రూ. 800 వరకు చేరాయి. ఈ అకస్మాత్తు పెరుగుదల మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది.

### ఎందుకు పెరుగుతున్నాయి?

1. ఎండల తీవ్రత : మే నెలలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు చేరుకోవడంతో కోళ్లు వేడిని తట్టుకోలేక మరణిస్తున్నాయి . దీంతో పౌల్ట్రీ ఫారాల్లో దిగుబడి గణనీయంగా తగ్గింది. 2. ఫీడ్ ఖర్చులు: కోళ్లకు పెట్టే మేత మొక్కజొన్న, సోయా ధరలు పెరగడం వల్ల నిర్వహణ ఖర్చు భారమై, రైతులు కోళ్ల

2లో..

# మోదీతో కలిసి పనిచేయడానికి రెడీ

- ప్రధాని మోదీ పిలుపుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన
- అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రంతో కలిసి వెళ్తామని వెల్లడి
- పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా కలిసి పనిచేస్తామని స్పష్టం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా హైదరాబాద్ హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి ఒకే వేదికపై కనిపించడం

2లో..



ప్రజాప్రశ్న



# చట్టం ముందు ఎవరూ అధికులు కారు

నిబంధనలు తెలియవా అని ప్రశ్నించారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఆయన మాట మార్చిన తీరును రేవంత్ గుర్తు చేస్తూ ఆయన నైతికతను ప్రశ్నించారు. ఒక మైనర్ బాలికకు సంబంధించిన విషయం కాబట్టి అందరూ బాధ్యతగా ఉండాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

### పక్షపాతం లేదు.. గతంలోనూ చర్యలు తీసుకున్నాం

గతంలో కేటీఆర్ బంధువుకు సంబంధించిన డ్రగ్స్ కేసులో కూడా తాము వెనకాడకుండా చర్యలు తీసుకున్నామని రేవంత్ గుర్తు చేశారు. బండి భగీరథ్ కేసులో కూడా పోలీసులు స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఎవరికీ మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ విమర్శల కోసం అధికారులపై ఒత్తిడి తేవడం సరికాదని ఆయన హితవు పలికారు.

# స్టాలిన్‌తో సీఎం విజయ్ భేటీ

పాల్గొన్నారు. అయితే, టీవీకే వర్గాలు మాత్రం ఇది మర్యాదపూర్వక భేటీ అని చెబుతున్నా ఇంకేదో ఉందనే చర్చ జరుగుతోంది.డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలు విజయ్‌కు మద్దతు ఇవ్వడం వెనుక స్టాలిన్ వ్యూహం ఉందనే ఊహాగానాల వేళ ఆయన నివాసానికి విజయ్ వెళ్లడం ప్రాధాన్యత ఏర్పడింది. ఇదిలా ఉండగా, స్టాలిన్‌ను కలిసిన తర్వాత ఎండీఎంకే నేత వైకో నివాసానికి విజయ్ వెళ్తారని సమాచారం. ఈ పార్టీ కూడా డీఎంకే కూటమిలో ఉంది. నాలుగు చోట్ల ఆ పార్టీ పోటీ చేసినా ఒక్క చోట కూడా విజయం సాధించలేదు. అలాగే, ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన మిత్రపక్షం విదుతలై చిరుతగైల్ కట్చి (విసికె) పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్‌కు కూడా విజయ్ కలవనున్నట్టు సమాచారం. అశోక్ నగర్‌లోని ఆయన నివాసానికి మంగళవారం వెళ్లనున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరి ఇవన్నీ మర్యాదపూర్వక భేటీలు అయితే అన్నాడీఎంకే నేతలను విజయ్ కలుస్తారా? ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిసామి ఇంటికి వెళ్తారా? అనే ఉత్కంఠ నెలకొంది.

# మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

# బండి భగీరథ్ కేసుతో బీజేపీకి సంబంధం లేదు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఈ ఘటన కేవలం బండి సంజయ్ ఫ్యామిలీకి సంబంధించిన అంశమని బీజేపీలో జరిగింది కాదని తేల్చి చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు బండి భగీరథ్ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. కొంతమంది అనవసరంగా ఈ విషయాన్ని బీజేపీకి అంటగడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.బండి భగీరథ్ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలని తెలిపారు. ఇది న్యాయపరమైన అంశమని ఈ విషయంలో చట్టం చేయాల్సిన పని చేస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. మరోవైపు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ సక్సెస్ కావడం పట్ల బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సభ విజయవంతం కావడానికి సహకరించిన వారు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.మరోవైపు ఇదే వ్యవహారంపై ఆదివారం రోజున ప్రధాని మోదీ సభలో మాట్లాడిన కేంద్రమంత్రి బండి సంజయ్ కంటతడి పెట్టుకున్న సంగతి తెలిసిందే. కొందరు కావాలనే తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనను రాజకీయంగా ఎదుర్కొలేని కొంతమంది దద్దమ్మలు ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పార్టీకి తలవంపులు తెచ్చే పనులు తాను ఎన్నటికీ చేయబోనని బండి సంజయ్ తేల్చి చెప్పారు.

# ప్రధాని మోదీ ఏడు సూత్రాలు ఒక జాతీయ మిషన్

ప్రధాని మోదీ సికింద్రాబాద్ వేదికగా సూచించిన అంశాలను చంద్రబాబు పారిశ్రామికవేత్తల ముందుకు తెచ్చారు

1. వర్క్ ఫ్రమ్ హోమ్: ప్రయాణ ఖర్చులు తగ్గించి, సమయాన్ని ఆదా చేసేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలి.
2. బంగారు కొనుగోళ్ల వాయిదా: విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు కొంతకాలం బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలి.
3. పొదుపుగా ఇంధన వినియోగం: వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో, ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించాలి.
4. సహజ సిద్ధమైన వ్యవసాయం: రసాయన ఎరువుల దిగుమతి భారాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి.
5. స్వదేశీ ఉత్పత్తుల వాడకం: దిగుమతులపై ఆధారపడటం తగ్గించి మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించాలి.
6. వంట నూనెల పొదుపు: విదేశాల నుండి దిగుమతి చేసుకునే వంట నూనెల వాడకాన్ని తగ్గించాలి.
7. విదేశీ పర్యటనల నియంత్రణ: కనీసం ఏడాది పాటు విదేశీ విహారయాత్రలను వాయిదా వేసుకోవాలి.

### పారిశ్రామికవేత్తలకు పిలుపు

పారిశ్రామిక దిగ్గజాలను ఉద్దేశించి ఈ సంస్కరణలను కేవలం ప్రధాని బాధ్యతగా మాత్రమే చూడకండి. ఇది మన దేశం పట్ల మనకున్న ధర్మం. భారత్ ఒక తిరుగులేని శక్తిగా ప్రపంచ వేదికపై ఎదగాలంటే ఇలాంటి కఠిన నిర్ణయాలు అవసరం అని చంద్రబాబు అన్నారు. సవాళ్లు ఎప్పుడూ కొత్త అవకాశాలను తీసుకొస్తాయని, ప్రస్తుత కష్టాలను దాటుకుని భారతదేశం మరింత శక్తివంతంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పారిశ్రామికవేత్తల ముందు తన విజన్ స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలబెడతామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ వేస్తామని, అమరావతి పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### అమిత్ షా, సి.ఆర్. పాటిల్‌తో కీలక చర్చలు

అంతకు ముందు రాష్ట్ర అభివృద్ధిపై చంద్రబాబు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో భేటీ అయిన ఆయన, విభజన హామీల అమలు మరియు పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలపై చర్చించారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ను కలిసి పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ పనులు, డయాఫ్రమ్ వాల్ మరమ్మతులు , రెండో దశ నిధుల గురించి విజ్ఞప్తి చేశారు. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని, దీనికి కేంద్రం పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు నీతి ఆయోగ్ ప్రతినిధులు, ప్రపంచ బ్యాంకు అధికారులతో కూడా భేటీ అయ్యారు.

# 10వ తరగతి పరీక్షలలో ప్రతిభావంతుల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలోని మచాని సోమప్ప జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (ఎంఎస్ జెడ్ పి హెచ్ బాలికల స్కూల్)లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినుల సన్మాన కార్యక్రమం మరియు పతకాలు, ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని దీపప్రజ్వలనతో ప్రారంభించి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 550కు పైగా మరియు 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థినులను పతకాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు మరియు తల్లిదండ్రులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక తమకు ఎంతో ఉపయోగపడిందని, ఉన్నత మార్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. విద్యార్థులను పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విద్యా శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారానే పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. అలాగే ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం గొప్ప విజయమని పేర్కొన్నారు.

## టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్లే

# పది తర్వాత డ్రాప్‌అవుట్లు

పాఠశాల, కాలేజీ విద్యను అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ క్రమంలోనే జూన్‌లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు 9 వస్తువులతో కూడిన విద్యా కిట్లను పంపిణీ చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ విద్యా కిట్ల కోసం రూ.1100 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. అదే సమయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు బలవర్ధకమైన పాలు, రాగి జావ వంటి పోషకాహారాలను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.ప్రస్తుతం విద్యారంగంలో సమూల మార్పులు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ మనం మాత్రం ఇంకా పాతకాలం సిలబస్‌నే చదువుకుంటున్నామని పేర్కొన్నారు. టెన్ ప్లస్ టూ (10o2) విధానం తెలంగాణలో లేకపోవడం వల్లే పదో తరగతి తర్వాత డ్రాపౌట్లు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేశారని అలా చేయడం వల్ల కులవివక్ష పెరుగుతుందని గ్రహించినట్లు చెప్పారు. విద్యార్థుల మధ్య కులవివక్ష లేకుండా చూసేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా ప్రభుత్వ పాఠశాలలు మారాలని తెలిపారు. తెలంగాణలో విద్యా సంస్కరణల్లో భాగంగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యా కమిషన్ సూచనలతో సరికొత్త విధానాన్ని తెస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం 19 లక్షల మందే చదవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు.ఇక రాష్ట్రంలో ఉన్న టీచర్లకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ విద్యా విధానాలపై అవగాహన కల్పించేందుకు వారిని విదేశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 25 మంది టీచర్లను ఫిన్లాండ్‌కు పంపించామని త్వరలో జపాన్, వియత్నాం, సింగపూర్ దేశాలకు మరికొందరిని పంపిస్తామని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 500 మంది టీచర్లను విదేశాలకు పంపించేలా ప్రణాళికలు రెడీ చేయాలని ఆదేశించారు. ఇక రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 11000 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి తక్కువ సమయంలో ఖాళీలను భర్తీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని తేల్చి చెప్పారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 22 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు.

# చికెన్ ధరలకు రెక్కలు

పెంపకాన్ని తగ్గించేశారు.3. పెళ్లిళ్ల సీజన్: ప్రస్తుతం ముహూర్తాల సీజన్ కావడంతో ఫంక్షన్ హాల్స్, హోటళ్ల నుండి ఆర్డర్లు విపరీతంగా పెరిగాయి. డిమాండ్ ఎక్కువగా ఉండి, సప్లై తక్కువగా ఉండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

### సరఫరా కొరత - డిమాండ్ పెరుగుదల

తెలంగాణలో రోజుకు సగటున 11 లక్షల కిలోల చికెన్ వినియోగం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఎండల వల్ల కోళ్లు బరువు తూగకపోవడం 1.5 కిలోలకే పరిమితమవడం వల్ల మార్కెట్లోకి తక్కువ మాంసం వస్తోంది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్ నుండి కూడా హైదరాబాద్ మార్కెట్‌కు కోళ్ల సరఫరా తగ్గడం ధరల పెరుగుదలకు మరో కారణం. గ్యాస్ సిలిండర్, నూనె ధరలు ఇప్పటికే భారంగా మారాయి. ఇప్పుడు చికెన్ కూడా కిలో రూ. 400 కి చేరువలో ఉండటంతో ముక్క లేనిదే ముద్ద దిగని సామాన్యుడికి ఇది పెద్ద దెబ్బ అని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ప్రతిభా పురస్కార్ అవార్డును అందుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మహేశ్వరి

**- బోయినిపల్లి మండల టాపర్‌గా నిలిచిన మహేశ్వరి గ్రామానికి గర్వకారణం**

**- కొదురుపాక గ్రామ సర్పంచ్**

**- డాక్టర్ కత్తెరపాక మంజుల - సుధాకర్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) పదవ తరగతి పరీక్షల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల టాపర్‌గా కొదురుపాక జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కూడుదుల మహేశ్వరి నిలిచింది. ఆమె 565 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో బిసిటిఏ ఎన్జీవో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కార్ కార్యక్రమంలో మండల స్థాయి టాపర్‌గా మహేశ్వరిని అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం మాధవీలత, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొదురుపాక గ్రామ సర్పంచ్ డాక్టర్ కత్తెరపాక మంజుల - సుధాకర్ మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన విద్యార్థిని మండల టాపర్‌గా నిలవడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక బృందం, తల్లిదండ్రులను అభినందించారు.

## మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు

# దొంగలించిన గుర్తుతెలియని దుండగులు

**- బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని పోతన శెట్టిపల్లి టీ జంక్షన్ వద్ద చేపల వృత్తి కొనసాగిస్తున్న బోల లావణ్య ఌ/శీ ఎగొండ వయస్సు 38 సంవత్సరాలు కులం ముదిరాజ్ వృత్తి గృహిణి గ్రామం పొతంశెట్టిపల్లి కొల్చారం మండలం ని తమరితో మనవి చేయునది ఏమనగా మాకు ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలోని రైతు వేదికకు ఎదురుగా జై దుర్గా భవాని చాపల దుకాణం కలదు అట్టి దుకాణంలో ఈరోజు తేదీ 11 5 2026 నాడు మధ్యాహ్నం అందాజా 3:25 నిమిషాల సమయం లో నేను షట్టర్ ఓపెన్ చేసి పడుకున్నాను అదే సమయంలో నా మెడ పైన గుంజినట్లు అనిపించగా నేను వెంటనే నిద్రలో నుండి లేచి చూడగా ఇద్దరు మగ వ్యక్తులు షాపులో నుంచి పరిగెత్తి స్కూటీ పైకి ఎక్కి వెళ్ళిపోయారు నేను నా మెడలో చూడగా నా యొక్క బంగారు పూసలతాడు కనిపించలేదు నేను గట్టిగా అరుస్తూ స్కూటీ వెనుక వెళ్ళగా అట్టి ఇద్దరు మగ వ్యక్తులు పారిపోయారు అట్టి బంగారపుస్తేల తాడు సుమారుగా మూడు తులాలు ఉంటుంది మరియు నా యొక్క ఒప్పో సెల్ ఫోన్ నెంబర్ 7842255484 గల దానని కూడా గుర్తుతెలియని ఇద్దరు మగ వ్యక్తులు తీసుకొని పోయినారు. అట్టి బంగారు పుస్తెలతాడు యొక్క విలువ సుమారుగా 4,50,000 ఉంటుంది కావున తమరు తాగు విచారణ జరిపి నా మెడలో నుండి బంగారు పూసల తాడు మరియు ఒప్పో సెల్ ఫోన్ ను దొంగలించుకుని పోయిన ఇద్దరు మగ వ్యక్తులపై తగు చట్టారీత్యా చర్య తీసుకోగలరని కొల్చారం ఎస్సై కు ఫిర్యాదు చేశారు

# విభజన హామీలు, పెండింగ్ నిధులు

జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని, విభజన హామీలను నెరవేర్చాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయిన చంద్రబాబు రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావలసిన నిధులతో పాటు, విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు జరిపి, అవసరమైన సహకారం అందించాలని కోరారు.అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తాను ఇప్పటికే ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించానని, కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం ఏప్రిల్ నాటికి పూర్తయిందని వివరించారు. ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా ఉన్న 'స్టాప్ వర్క్ ఆర్డర్'ను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, సామర్థ్యం పెంచిన కుడి, ఎడమ కాలువలకు అయిన అదనపు ఖర్చును రీఎంబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇదే సమావేశంలో 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన'లోని 'హర్ ఖేత్ కో పానీ' పథకం కింద రాష్ట్రంలోని 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఆలమట్టి డ్యామ్ ఎత్తును 524.256 మీటర్లకు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఏపీ ప్రయోజనాలకు నష్టం చేకూరుస్తుందని, కర్ణాటక చేపడుతున్న పనులను నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర దాహార్తిని తీర్చే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని, నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు.

అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు.

ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# మోదీతో కలిసి పనిచేయడానికి రెడీ

ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని మోదీ పెద్ద మనసు చూపించాలని రేవంత్ రెడ్డి కోరగా తమతో కలిసి రావాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఈ వ్యాఖ్యలే తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న వేళ సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.ప్రధాని మోదీ తమతో కలిసి రావాలనే పిలుపును తాను స్వాగతిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మీడియాతో సోమవారం చిట్‌చాట్‌గా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ఆదివారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున తాను పాల్గొన్నట్లు వెల్లడించారు. ఇక తమతో కలిసి పనిచేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపులో ఎలాంటి రాజకీయాలు లేవని తేల్చి చెప్పారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వికసిత్ భారత్ నినాదం లాగే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విజన్ 2047ను సాధించేందుకు తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి నడుస్తుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబించి ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇక కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో పార్టీలు వేరుగా ఉన్నా ఆ పార్టీల సిద్ధాంతాలు వేరే అయినా అభివృద్ధి కోసం మాత్రం కలిసే పనిచేస్తామని మరోసారి నొక్కి చెప్పారు. తాను గతంలో ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లి అక్కడి కేంద్రమంత్రులను, ప్రధాని మోదీని కలిసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు ఆశించిన మద్దతు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి కాస్త అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని నిన్న ప్రధాని మోదీ ముందే సభలో చెప్పినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా తనకు ప్రధాని మోదీ 2 గంటల సమయం ఇస్తే తెలంగాణ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం తయారు చేసిన ప్రణాళికలను వివరిస్తామని వెల్లడించారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా

# గద్వాల విజయలక్ష్మి

కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వీరు ఐదేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ రామకృష్ణరావు విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.గద్వాల్ విజయలక్ష్మి 2021 నుండి 2026 వరకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మేయర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌కు ఐదవ మహిళా మేయర్‌గా మరియు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి మహిళా మేయర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

### తెలంగాణ మహిళా కమిషన్ ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా కమిషన్‌లో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారికి సామాజిక సేవ చేసిన మహిళలకు చోటు కల్పించింది.

ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చింది.

### శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మ

తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు కోరుతూ శ్రీకాంతచారి ప్రాణ త్యాగం చేశాడు.

అయితే శంకరమ్మ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా సైతం పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ ఇవ్వలేదు. తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం శంకరమ్మకు మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించడంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయింది.

### చాకలి ఐలమ్మ మనవరాలు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు అయిన చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే.ఈ నియామకంతో చాకలి ఐలమ్మ కుటుంబానికి న్యాయం చేసినట్లు అయ్యింది.

### సామాజిక సమీకరణాల నేపథ్యంలో వీరికి చోటు

మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# బెంగతీరిన బెంగాల్.. ఆలస్యమైనా అంతిమ విజయం మానవత్వానిదే

**– వైద్య దేవుళ్లపై దాడి చేసిన దుర్మార్గానికి ప్రజాస్వరం ఇచ్చిన చరిత్ర**
**– వ్యవస్థాపక అధ్యక్షులు "ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం"**
**– సింహాచలం లక్ష్మణస్వామి, హైదరాబాద్**




ప్రపంచమంతా చేతులెత్తేసినప్పుడు కూడా ప్రకృతి మాత్రం తను వదలదు.
న్యాయం ఆలస్యమవుతుందేమో కానీ ఆగిపోదు. మనుషులు విఫలమైతే కాలమే తీర్పు చెబుతుంది. అది మన భారతదేశం.
ఇది "జ్ఞానభారతి".. ఇది "ధర్మభారతి".

బెంగాల్‌లో జరిగిన ఆ దారుణ సంఘటన కేవలం ఒక వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య మాత్రమే కాదు అది మానవత్వంపై జరిగిన దాడి.
ప్రాణాలు కాపాడే చేతులను రాక్షసత్వం చీల్చివేసిన రోజు అది. ఆ రోజు దేశమంతా రోదించింది. ప్రపంచం నివ్వెరపోయింది. వైద్యలోకం కన్నీరు పెట్టుకుంది.

ఒక వైద్యురాలు.. ఎవరైనా రాజకీయ నాయకురాలు కాదు, ఎవరైనా సినీ నటి కాదు, ప్రజల ప్రాణాలు కాపాడటానికి అర్ధరాత్రులు మేల్కొని సేవచేసే ఒక యువ వైద్యురాలు. అలాంటి పవిత్ర వృత్తిలో ఉన్న ఆమెపై జరిగిన అమానుషం దేశ మనసును కదిలించింది. కానీ ప్రజలను మరింత కలచివేసింది సంఘటన కంటే తరువాత జరిగిన వ్యవహారమే.

ప్రజలు ఆశించింది న్యాయం. వైద్యులు కోరింది రక్షణ. మహిళలు అడిగింది భద్రత. కానీ అధికారంలో ఉన్నవారి నుండి వచ్చినది నిర్లక్ష్యం అనుమానాలు రాజకీయ రక్షణ, ఆలస్యం. ఇది ప్రజల గుండెల్లో గాయం అయింది.

మహిళా ముఖ్యమంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలకే రక్షణ లేకపోతే, ఆరోగ్యశాఖను నడిపే పాలకులున్న చోట వైద్యులకే భద్రత లేకపోతే, అది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు – సమాజానికి ప్రమాద ఘంటిక. "చేను కంచె చేను మేస్తే" అన్నట్టుగా పరిస్థితులు మారిపోవడం ప్రజలను కలవరపరిచింది.

ఎంతటి అధికారం ఉన్నా, ఎంతటి అధికార మదం ఉన్నా, ఎంతటి రాజకీయ బలం ఉన్నా, ప్రజల ఆవేదనను ఎవరూ శాశ్వతంగా అణగదొక్కలేరు. బెంగాల్ ప్రజలు చివరికి ఒక సందేశం ఇచ్చారు – "వైద్య దేవుళ్లను అవమానించే పాలనకు స్థానం లేదు" అని.

ఆ బాధితురాలి తల్లి ప్రజల ముందుకు రావడం, ఆమెకు ప్రజలు అండగా నిలవడం, అది కేవలం ఒక రాజకీయ పరిణామం కాదు, అది సమాజపు అంతరాత్మ పలికిన తీర్పు.కారణాలు ఎన్నో ఉండొచ్చు. 15 ఏళ్ల పాలనపై వ్యతిరేకత ఉండొచ్చు. అవినీతి ఆరోపణలు ఉండొచ్చు. ప్రజల్లో అసంతృప్తి ఉండొచ్చు. కానీ ప్రజల మనసును లోతుగా తాకిన సంఘటన మాత్రం ఇదే అని కోట్లాది మంది భావించారు.

ఎందుకంటే వైద్యుడు కేవలం ఒక ఉద్యోగి కాదు. మన భారతీయ సంస్కృతి వైద్యుణ్ణి "వైద్యో నారాయణో హరి" అని పిలిచింది. ప్రాణాలను కాపాడేవాడిని దేవుడితో సమానంగా చూసింది. మనకు జన్మనిచ్చేది తల్లి. జీవితం నేర్పేది గురువు. ప్రాణాలు నిలబెట్టేది వైద్యుడు.

అందుకే మన సంస్కృతి "మాతృదేవోభవ" "పితృదేవోభవ" "ఆచార్యదేవోభవ" అని చెప్పింది. ఈ భూమిపై వైద్యులు లేకపోతే ఈ ఆధునిక కాలంలో ఒక్కరోజు కూడా మానవజాతి నిలబడలేదు. అది జగమెరిగిన సత్యం. అవును కొన్నిసార్లు కొందరి తప్పిదాల వల్ల వైద్యరంగంపై విమర్శలు వస్తాయి. కానీ కొందరి పొరపాట్లను మొత్తం వైద్యలోకానికి ఆపాదించడం మహా అన్యాయం. వేలాది మంది వైద్యులు తమ కుటుంబాలను కూడా మరిచి సేవ చేస్తున్నారు.
అనేకమంది తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రాణాలను కాపాడుతున్నారు.

కరోనా సమయంలో ప్రపంచం చూసింది – వైద్యులు ఎలా దేవుళ్లలా నిలిచారో. అలాంటి వృత్తిపై దాడులు జరగడం, వైద్యులపై హింస పెరగడం, వైద్యురాళ్లపై అమానుషాలు జరగడం, సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఈరోజు వైద్యుడిని రక్షించలేని సమాజం, రేపు తన ప్రాణాలను కూడా రక్షించుకోలేని పరిస్థితికి వెళ్తుంది. అందుకే నేను ఒక వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా దేశానికి ఒక వినమ్ర విజ్ఞప్తి చేస్తున్నాను వైద్యులపై దాడులను ఏమాత్రం ఉపేక్షించకండి. వైద్య సేవలను కేవలం వ్యాపార దృష్టితో చూడకండి. ప్రజల ప్రాణాల కోసం పోరాడే వారిని గౌరవించండి. వైద్యురాళ్ల భద్రతను అత్యున్నత ప్రాధాన్యంగా చూడండి.

ఎందుకంటే దైవసమానులపై దాడి జరిగితే ప్రకృతి నిశ్శబ్దంగా ఉండదు. ప్రపంచమంతా చేతులెత్తేసినప్పుడు కూడా ప్రకృతి తను వదలదు. మనుషులు న్యాయం చేయలేని చోట కాలమే తీర్పు చెబుతుంది. బెంగాల్ మనకు ఇచ్చిన అతిపెద్ద సందేశం ఇదే. అధికారంతో ప్రజలను భయపెట్టవచ్చు కానీ ప్రజల అంతరాత్మను ఓడించలేరు. వైద్య దేవుణ్ణి కాపాడేది చివరికి అసలైన దేవుడే. ఈ సంఘటన వైద్యలోకానికి ఒక హెచ్చరిక మాత్రమే కాదు ఒక ఆత్మవిశ్వాసం కూడా. నిస్వార్థంగా పనిచేసే వైద్యుని కన్నీరు వృథా కాదు.వైద్యుడి ఆవేదనకు సమాజం ఒకరోజు తప్పకుండా స్పందిస్తుంది. మానవత్వం చివరికి గెలుస్తుంది.

**ఆలస్యమైనా అంతిమ విజయం మానవత్వానిదే.**

# మోడీ సభ సక్సెస్ టార్గెట్ తెలంగాణ:ఈటెల



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** మొన్న ప్రధాని మోడీ పరేడ్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతమైందని మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ నిన్న గాయత్రి గార్డెన్స్ లో విలేకరుల సమావేశంలో తెలిపారు.బహిరంగ సభకు వేలాది సంఖ్యలో మోడీ అభిమానులు భాజాప శ్రేణులు తరలిరావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది భాజపా ప్రభుత్వమేనని మోడీ సైతం చెప్పడం శుభసూచకమని అన్నారు.మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో భాజపా జెండా ఎగురవేసిన విషయం విదితమే.అయితే పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకొని బిజెపి రాజకీయ పావులు కదపడం ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు.మల్కాజ్ గిరి పార్లమెంటుతో పాటు తెలంగాణ వ్యాప్తంగా వేసవి తాకిడిని సైతం తట్టుకొని వచ్చిన ప్రజలకు కార్యకర్తలకు అభిమానులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు పూర్తిగా విసుగు చెందారని,గతంలోనే వారసత్వ కుటుంబ రాజకీయాలకు చరమగీతం పాడారనట్లు రేపు ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.భారత దేశ ప్రజలను ఉద్దేశించి విదేశీ మారక విలువలు తగ్గకుండా విదేశాల నుండి వచ్చే వస్తువుల దిగుమతిని తగ్గించుకోవాలన్నారు. "మేకింగ్ ఇండియా"పై దృష్టి పెట్టాలన్నారు.అదిగాక గత 10 రోజులుగా మాకు సహకరించిన మీడియా వారందరికీ ధన్యవాదములు. ప్రధాని సమావేశానికి కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు తరలి రావడం సంతోషం. మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా, సికింద్రాబాద్,రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,మోర్చాల నాయకులు,డివిజన్ల నాయకులు,అపార్ట్మెంట్స్ పాలకమండల్లు,ఉత్తర భారత సమాజం వారి సహకారంతో సమావేశం విజయవంతం అయ్యింది.సభా ప్రాంగణాల్లో ఎంత మంది ఉన్నారో బయట కూడా అంతమంది ఉండడం విశేషం.నిన్న మీటింగ్ కి ఎక్కువ మంది హాజరైంది మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ ప్రజలే.ఈ బహిరంగ సభతో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ గడ్డమీద గెలవబోయేది బీజేపీ అని నరేంద్ర మోడీ సంకేతాలు ఇచ్చారు.నేను 365 రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటున్నా,రాష్ట్రంలో ప్రజా సమస్యలు పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీ.త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం పెట్టుకుంటాం. మోడీ మూడవ సారి ప్రధాని అయ్యాక ప్రతి రాష్ట్రంలో గెలుచుకుంటూ దేశమంతా బీజేపీని విస్తరించారు.అదే విధంగా తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తాము. సమస్యలు తీరాలన్నా, రాష్ట్రం అప్పుల ఊబిలో నుండి బయటపడాలన్నా, రైతుల,విద్యార్థుల సమస్యలు తీరాలన్న బీజేపీ రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.బీజేపీని ఆశీర్వదించండి మీరు మెచ్చే పాలన అందిస్తామని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.ప్రధాని ఆలోచన మేరకు మేము నడుచుకుంటాం.స్వదేశీ ఉత్పత్తులు ఎక్కువగా వాడాలని విదేశీ మారక ద్రవ్యం ఖర్చు కాకుండా చూడాలని మోడీ తెలిపిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం.అమెరికాలో సైతం పెట్రోల్ గ్యాస్ ధరలు పెరిగాయి.ప్రపంచమంతా యుద్ధం ప్రభావం పడింది.మోడీ ప్రజలను విజ్ఞప్తి చేస్తున్నారు అంటే ఎంత గంభీరమైన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవాలి.ఆయన పిలుపును అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈటెల.అందుకే మేక్ ఇన్ ఇండియా,మేడ్ ఇన్ ఇండియా కోసం మోడీ ప్రయత్నిస్తున్నారు.బీజేపీలో నాయకత్వానికి కొదవలేదు. ప్రధాని వచ్చినప్పుడు నిధులు ఇవ్వమని అడుగుతారు, వెళ్ళగానే ఏమిచ్చారని విమర్శిస్తారు.కేసీఆర్ కూడా మోడీ రాష్ట్రానికి వచ్చినప్పుడు,మాకు ఏమీ వద్దు మీ ప్రేమ చాలని అన్నారు.కొన్నాళ్లకే ఏం ముఖం పెట్టుకొని వస్తారని విమర్శించారు.అలా మాట్లాడిన కేసీఆర్ ఏమయ్యాడు అందరికీ తెలిసిందే.కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి కాబట్టే ప్రభుత్వం నడుస్తుంది. మీరు ఇచ్చిన హామీలు ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదు

మాటలు జాగ్రత్తగా మాట్లాడుకోవాలి. అధికారంలో ఉంటాం పోతాం కానీ మాట శాశ్వతంగా ఉంటుంది.నోరు బాగుంటే ఊరు బాగుందని పెద్దలు ఉరుకనే చెప్పలేదు అని ఈటెల రాజేందర్ విలేకరులతో పంచుకున్నారు. మరో విషయం ఏమిటంటే తెలంగాణ రాష్ట్రంలో రేపు "డబుల్ బుల్డోజర్"పరిపాలన రాబోతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా,మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్,భాజపా సీనియర్ నాయకులు మల్లికార్జున్,విజయ్ ఆనంద్, వైశాలి మహిళా మోర్చ నాయకురాలు,గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్,బిజేవైఎం మాజీ అధ్యక్షుడు భాను ప్రకాష్,రవి తదితరులు పాల్గొన్నారు.

## కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్ పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి ((ప్రశ్న న్యూస్ ) రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, అన్లోడింగ్ లో సమస్యలు తలెత్తుకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కొల్చారం మండల కేంద్రంలోని ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగ్ లు సరిపడా పంపిస్తున్నారా లేదా?కేంద్రాలకు కేటాయించిన లారీలు వస్తున్నాయా? లేదా? అలాగే నమోదు అయిన ఓపీఎంఎస్ వివరాల గురించి కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 13 లారీల ధాన్యం ఈ సెంటర్ నుండి సత్య సాయి రైస్ మిల్లుకు తరలించడం జరిగిందని ఈ సెంటర్లో హమాలీల కొరత లేదని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సివిల్ సప్లై అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ మనోహర్ సీఈఓ కృష్ణ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి..

### కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలి.

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన మైనర్ బాలిక లైంగిక దాడి ఆరోపణల కేసులో పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని అతడిని అరెస్టు చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత దారుణమైందని, ఇలాంటి సంఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయని అన్నారు. బాధితురాలు చిన్నారి కావడంతో ఈ కేసును అత్యంత సున్నితంగా తీసుకుని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, సాధారణ ప్రజలపై ఒక విధంగా -- అధికార పార్టీల నాయకుల కుటుంబ సభ్యులపై మరో విధంగా వ్యవహరించడం సరికాదని స్పష్టం చేశారు.బండి భగీరథ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు పోలీసులు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తన కుమారుడిని రక్షించేందుకు బండి సంజయ్ కుమార్ తన పదవి ప్రభావాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతోందని ఆరోపించారు. నిందితుడు ఎవరి కుమారుడైనా చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం నిరూపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు న్యాయం జరగకపోతే మహిళలు, చిన్నారుల భద్రత ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం నేరాల నియంత్రణలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి తన కుటుంబ సభ్యుడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పదవిలో కొనసాగడం సరికాదన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ముందుగా ఆయన పదవి నుంచి తప్పుకోవాలని పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ జిల్లా కౌన్సిల్ మెంబర్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పసుల వెంకటేశం సుజాత కుమారుడి వివాహ సందర్భంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వివాహం కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య బిజెపి పార్టీ మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వధూవరులు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో హాయిగా జీవించాలని ఆశీర్వదించారు ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎంబరి శేఖర్ యాదవ్, ఎంబరి శీను, తదితరులు పాల్గొన్నారు.

## సౌదీ అరేబియాలో
# చారిత్రాత్మక ‘మినీ మహానాడు’

**– పసుపు పండించిన తూర్పు ప్రాంతం!**

**అమరావతి** 2026 సంవత్సరానికి గాను ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాతూర్పు ప్రాంతంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ఘనవిజయాన్ని సాధించింది. ఈ మహోత్సవాన్ని కోనేరు ఉమామహేశ్వరరావు, వరప్రసాద్ కందిబెడల, సంపత్ కోయ, నాగశేఖర్ చందగాని, నాగేశ్వరరావు బులుసు, ప్రభాకర రెడ్డి, దిలీప్ ,కేవీఎన్ రాజు, శ్రీనివాస్ గుబ్బల, మనోహర్ ప్రసాద్, నిస్సార్ అహ్మద్, శివ సిరిగిన, రాజేంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, రోహిత్ నందా, కిషోర్ ఔఃః, ప్రవీణ్ కోలేటి, రాజ్యలక్ష్మి నందమూరి, శారద కోనేరు, వర్ధిని బులుసు, అనిత నాగశేఖర్, సత్య మల్లిన తదితర నాయకులు, కార్యకర్తల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం తూర్పు ప్రాంతం మొత్తం పసుపు పండించినట్లైంది. సభా ప్రాంగణం అంతా పసుపు రంగుతో అలంకరించబడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సింగపూర్ చేరుకున్న
# విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

**సింగపూర్** విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ చేరుకున్నారు. అయన ప్రవాసాంధ్రులు స్వాగతం పలికారు. రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీ రాష్ట్రానికి తీసుకొచ్చినందుకు లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ మీరంతా రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లు గా మారాలి. మీరు పనిచేస్తున్న కంపెనీల్లో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడుల కోసం మాట్లాడాలని అన్నారు.

# ఇంకా దొరకని కల్పన ఆచూకీ

**హైదరాబాద్** విశ్రాంత ఐపీస్ వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో మూడు రోజులు గడుస్తున్నా నిందితుల ఆచూకీ లభించలేదు. పూణేలో ఉన్న పనిమనిషి కల్పన తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని వారి ద్వారా ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. బెంగుళూరులో ఉంటున్న కల్పన భర్తకు కూడా ఈ దోపిడీ గురించి సమాచారం ఉన్నట్లు గుర్తించి అతని కోసం గాలిస్తున్నారు. నిందితురాలు గతంలో పనిచేసిన మధ్యప్రదేశ్, లఖ్నవూ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో పని చేసిన పలు ప్రాంతాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రంజన్ రే భార్య తనూజ ఎక్కడ పడుకుంటుందని, నగలు, నగదు ఎక్కడ పెడుతుందని పక్కా సమాచారంతో కల్పన దోపిడీకి ప్లాన్ చేసిందని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

## బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం

**హైదరాబాద్** బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా? జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలి. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుంది.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ
# దగ్ధం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

**సాగర్** పోక్సో కేసు బాధితురాలైన 17 ఏళ్ల మైనర్ బాలిక వ్యక్తిత్వం గురించి కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేసారు. బండి సంజయ్ను వెంటనే అరెస్ట్ చేసి మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.

# తొర్రూరులో రైతుల రాస్తారోకో

**మహబూబాబాద్** మొక్కజొన్నలు తెచ్చి రెండు నెలలు అవుతుంది ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. అకాల వర్షాలకు మొలకలు వస్తున్నాయి. ఏ రాత్రి ఏం జరుగుతుందో అని ఇక్కడే కాపలా ఉండాల్సి వస్తుందని మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేసారు. . అత్తా కోడళ్ళు వెంటనే రావాలి అంటూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.రైతుల రాస్తారోకో తో వామణాలు భారీగా నిలిచిపోయాయి.

## కూల్ డ్రింక్ల కోసం రైతుల నుండి
# రూ. 200 వసూలు

**– అదనపు కలెక్టర్కు ఫిర్యాదు చేసిన రైతులు**

**యాదాద్రి భువనగిరి** చౌటుప్పల్లోని మార్కెట్ యార్డులో కూల్ డ్రింక్ ల కోసం నిర్వాహకులు తమ నుండి రూ. 200 వసూలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. గన్నీ బ్యాగుల ఇచ్చేందుకు కూడా డబ్బులు అడుగుతున్నారని, హమాలి ఛార్జిలు పెంచారాని, నాలుగు రోజులకు ముందు తూకం వేసిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో అకాల వర్షానికి తడిసి పోయాయని రైతలు అక్కడికి సందర్శనకు వచ్చిన అదనపు కలెక్టర్కు ఫిర్యాదు చేసారు.

## తాగకున్నా తాగినట్లు బ్రీత్ ఎనలైజర్ మెషిన్ చూపిస్తోంది

**– మంచిర్యాల డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన**

**మంచిర్యాల** మద్యం తాగకున్నా బ్రీత్ ఎనలైజర్ మెషిన్ తాగినట్లు చూపిస్తుందని, దీంతో అధికారులు తమను విధుల్లోకి తీసుకోవడం లేదని డిపో ఎదుట డ్రైవర్లు బైఠాయించారు. తాము మద్యం తాగలేదని మెషిన్ మార్చాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు నిరసన కు దిగారు. పలువురు ఆర్టీసీ డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా 56 పైగా రీడింగ్ చూపించింది. దాంతో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కున్నారు.

# పోలానికి నిప్పు.. ఆగిపోయిన రైలు

**నెక్కొండ** గుర్తు తెలియని వ్యక్తులు నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో పొలానికి నిప్పు పెట్టారు. మంటలు రైల్వే ట్రాక్ సమీపంలో ఎగిసిపడటంతో సికింద్రాబాద్ నుండి భద్రాచలంలో వెళ్లే కాకతీయ ఎక్స్ప్రెస్ను సుమారు 30 నిమిషాల పాటు నిలిపివేసారు. సమాచారం అందిన వెంటనే రైల్వే సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మొత్తానికి పెను ప్రమాదం తప్పింది.

## మద్యం మత్తులో సొంత బైక్ను తగులబెట్టిన యువకుడు

**రుద్రవరం** :కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సిఐ రాము తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు రోడ్డుకు వెళ్లే దారిలో దూదేకుల మౌలాలి (23) అనే యువకుడు మద్యం సేవించి, ఆ మత్తులో తన బైక్ను (ఏఖ 39 ఆ 2927) కాల్చివేశాడు.సమాచారం అందుకున్న ఎస్ఐ జయప్ప సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 273 రీడింగ్ రావడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ పేర్కొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన అదనపు ఎస్పీ ఎన్బి రత్నం



**మహబూబ్ నగర్** జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను అదనపు ఎస్పీ ఎన్బి రత్నం నేరుగా స్వీకరించి శ్రద్ధగా విన్నారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటిని పరిశీలించిన అదనపు ఎస్పీ సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్బి రత్నం మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగవంతమైన పరిష్కారం చూపేందుకు ఒక వేదికగా పనిచేస్తోంది. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నాము” అని పేర్కొన్నారు.

## బండి భగిరథ్ను అరెస్టు చేయాలని
# బీఆర్ఎస్ నిరసన

**నాగర్ కర్నూలు** బండి సంజయ్ కుమారుడు భగీరథపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వెంటనే బండి సంజయ్ కొడుకును అరెస్ట్ చేయాలని నాగర్కర్నూల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోమ్ శాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డి కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని, రేవంత్ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు.

# వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే అరవింద బాబు



**నరసరావుపేట** : పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నరసరావుపేటలోని గుంటూరు రోడ్డులో గల ఎమ్మెల్యే కార్యాలయంలో వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద బాబు చేతుల మీదుగా నలుగురు వికలాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సైకిళ్లు అందుకున్న వారిలో 1.వాల్లేం యోగమ్మ, ఏల్చూరు గ్రామం, 2.కుమ్మరి కుంట బంగారయ్య, 5వ వార్డు, క్రిస్టియన్ పాలెం, 3.మాడిశెట్టి నాగేంద్రరావు,5వ వార్డు, క్రిస్టియన్ పాలెం, 4.కటికల పూర్ణయ్య నరసరావుపేట వారికి అంద చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వారి స్వయం ఉపాధికి, సంచారానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం తమ ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ట్రై సైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న
# ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహా

**– అర్థరాత్రి 2 గం.లకు అందిన సమాచారంపై స్పందన**



**వెల్దుర్తి** పల్నాడు జిల్లా మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం వెల్దుర్తి మండల పరిధిలోని రామచంద్రాపురం తండాలో ఒక బాల్య వివాహాన్ని ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహా సకాలంలో స్పందించి, అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా విజయవంతంగా అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే రామచంద్రాపురం తండాలో ఒక మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు అర్ధరాతి 2 గంటలకు సమాచారం అందుకున్న ఇంచార్జ్ కలెక్టర్, వెంటనే సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్దుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, ఎస్.ఐ, ఐ.సి.డి.ఎస్ మరియు చైల్డ్లైన్ ప్రతినిధులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.అధికారులు బాలిక వయస్సు ధృవీకరణ పత్రాలను పరిశీలించగా, వివాహానికి చట్టబద్ధమైన వయస్సు నిండలేదని నిర్ధారణ అయ్యింది. దీంతో అధికారులు వెంటనే వివాహాన్ని నిలిపివేసి, బాలికను సంరక్షణలోకి తీసుకున్నారు. పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే బాల్య వివాహాలను జరపవద్దని ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం వివాహానికి బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండడం తప్పనిసరి అన్నారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులు, ఇందుకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో
# విలసిల్లుతోన్న నిడదవోలు

**– మంత్రి కందుల దుర్గేష్ కృషితో దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణాలకు రూ. 4.95 కోట్ల నిధుల వెల్లువ**



నిడదవోలు(ప్రశ్న న్యూస్) నిడదవోలు నియోజకవర్గంలో దైవభక్తి, ఆధ్యాత్మిక పరిమళాలు నలుదిశలా వ్యాపించనున్నాయి. కూటమి ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి దక్కుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అవిశ్రాంత కృషితో నిడదవోలు నియోజకవర్గంలోని పలు ప్రాచీన, ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధికి మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా రూ. 4.95 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిడదవోలు చరిత్రలో ఒక సువర్ణాధ్యాయానికి నాంది పలుకుతూ ఈ ప్రాంతాన్ని గొప్ప ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దాలన్న మంత్రి కందుల దుర్గేష్ సంకల్పం ఫలించింది. వివరాల్లోకి వెళ్తే నిడదవోలు పట్టణంలోని గోలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక నిధుల క్రింద రూ.50 లక్షలు మంజూరు కాగా, గోదావరి పుష్కరాలు–2027 నిధుల క్రింద పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో కొలువైన శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.2 కోట్లు నిధులను మంత్రి దుర్గేష్ రాబట్టారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని శ్రీ పర్వత వర్ధిని సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.1.25 కోట్లు మంజూరు చేయించారు. నిడదవోలు మండలం గోపవరం గ్రామంలోని శ్రీ గుబ్బలమ్మ అమ్మవారి దేవాలయానికి రూ.60 లక్షలు తీసుకొచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ క్రింద నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి రూ.10 లక్షలు, పెరవలి మండలంలోని నడుపల్లి గ్రామంలో కొలువైన శ్రీ దుర్గామాత అమ్మవారి ఆలయానికి రూ. 10 లక్షలు, మల్లేశ్వరం గ్రామంలోని శ్రీ వినాయక స్వామి ఆలయానికి రూ.20 లక్షలు, ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేయడంతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవ చూపించారు. అంతేగాక మంత్రి దుర్గేష్ నేతృత్వంలో నిడదవోలు నియోజకవర్గం సుభిక్షంగా, సకల సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ప్రతి ఒక్కరూ ప్రార్థించడం విశేషం.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ప్రకటించారు.

# ప్రజావాణి కి 185 దరఖాస్తులు

**– అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



**కరీంనగర్** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 129 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్లో పరిధిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది.కరీంనగర్ రెవెన్యూ డివిజన్ కు 40 దరఖాస్తులు, హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ కు 16 దరఖాస్తులు వచ్చాయి.కలెక్టర్, రెవిన్యూ డివిజన్లలో వచ్చిన మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ మహేశ్వర్, జెడ్పి సీఈవో శ్రీనివాస్, డి ఆర్ డి ఓ శ్రీధర్, ఏవో సుధాకర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వెండి నాగాభరణం సమర్పణ



**శ్రీశైలం.** ఈ రోజు (11.05.2026) యం. దినేష్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా వారు అయిదు శిరస్సులతో కూడిన వెండి నాగాభరణాన్ని దేవస్థానమునకు సమర్పించారు. ఈ వెండి నాగాభరణం బరువు 2 కేజీల 610 గ్రాములుఆలయ ప్రాంగణములోని ఆశీర్వచన మండప ములో దాతలు వీటిని అమ్మవారి ప్రధానార్చకులు విజయస్వామి, వేదపండితులు గంటి రాధకృ ష్ణశర్మ, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టర్ కె. మల్లికా ర్జున, గుమాస్తా సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## మే 23 నుండి శ్రీ గోవిందరాజస్వామివారి

# వార్షిక బ్రహ్మోత్సవాలు: టిటిడి

**మే 27న గరుడసేవ -- మే 30న రథోత్సవం**

**మే 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**



తిరుపతి (ప్రశ్న న్యూస్) కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 22వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారు వివిధ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను పవిత్రజలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

# బండి సంజయ్ కుటుంబంపై ఆరోపణలు రాజకీయ కక్షసాధింపే

**- బండి సంజయ్ కి ప్రజాదరణ చూసి ఓర్వలేకే కుట్రలు**

**- బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని ప్రజలకు వెల్లడిస్తాం**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**



బోయినపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో భాజపా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాం మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుటుంబంపై, ముఖ్యంగా వారి కుమారుడిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులో భాగమేనన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలు, కుటుంబాల పరువు ప్రతిష్టలను దెబ్బతీయడం సిగ్గుచేటని అన్నారు. హిందూ సమాజం కోసం పోరాడుతున్న బండి సంజయ్ కుమార్ ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారాలను వెంటనే ఆపాలని, లేనిపక్షంలో చట్టబద్ధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో భాజపా నాయకులు ఉదారి నరసింహ చారి,గుడి రవీందర్ రెడ్డి, మెరుపుల గంగాధర్ గౌడ్,జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి టీజేఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి

**- కంతి మోహన్ రెడ్డి**



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి పట్టణంలో టీజేఎస్ 4వ పార్టీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసమే తెలంగాణ జన సమితి ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రొఫెసర్ కోదండరాం ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. కలల తెలంగాణ సాకారం దిశగా వాటి అమలు కోసమే 4వ పార్టీ ప్లీనరీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే ప్లీనరీకి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పసునూరి శ్రీనివాస్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి దిలీప్, యువజన విభాగం నియోజకవర్గ ఇంచార్జి వన్నెల శశి, పింజరి రజనీకాంత్, విద్యార్థి విభాగం నియోజకవర్గ ఇంచార్జి రాంపల్లి శ్యామ్, మైలారం లక్ష్మణ్, రామగిరి శేఖర్, దగ్గుల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షణకు

# వార్డ్ ప్రత్యేక అధికారుల నియామకం

**- కమిషనర్ మయూర్ అశోక్**



గుంటూరు(ప్రశ్న న్యూస్) మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డుల వారీగా నియమించిన ప్రత్యేక అధికారులు రెవెన్యూ, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల పనులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయాలని, ప్రతి వార్డులో వార్డ్ లెవల్ పర్యవేక్షణ కమిటీలను 2 రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ ప్రత్యేక అధికారులు వార్డు సచివాలయాల పనితీరును పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వ సర్వేలు, ఎన్నికల పనులు, జనగణన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారిశుద్ధ్య విభాగంలో వార్డుల శుభ్రత, స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాలు, సాసా కార్యక్రమాల అమలు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ విభాగంలో పన్నుల వసూళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్ల అద్దెల వసూళ్లపై దృష్టి పెట్టాలని, ప్రజా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఉపా సెల్ పరిధిలో టిడ్కో హౌసింగ్ రుణాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఇతర సంక్షేమ పథకాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, టౌన్ ప్లానింగ్ విభాగం నిర్మాణ వ్యర్థాల తొలగింపు, అనధికార బ్యానర్లు ఫ్లెక్సీల తొలగింపుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు రోజువారీగా వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారానికి సంబంధిత శాఖాధిపతులతో సమన్వయం చేసుకోవాలన్నారు. శాఖాధిపతులు కూడా ప్రత్యేక అధికారులు సూచించిన లోపాలపై తక్షణ చర్యలు తీసుకుని అమలు నివేదికలను కమిషనర్ కార్యాలయానికి అందించాలన్నారు. క్షేత్ర స్థాయి విధుల్లో నిర్లక్ష్యం చేసే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి)జి.సాంబశివరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఈఈ సుందర్రామిరెడ్డి, వార్డ్ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ స్థానిక ఆలయాల్లో వైభవంగా

# హనుమజ్జయంతి వేడుకలు: టిటిడి

**ప్రత్యేక అభిషేకాలు - భక్తిశ్రద్ధలతో హనుమంత వాహనసేవలు**

తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయాలతో పాటు టీటీడీకి చెందిన ఇతర అనుబంధ ఆలయాల్లో మే 12న హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

శరణాగత భక్తికి, అచంచల శ్రీరామ సేవకు ప్రతీకగా నిలిచిన శ్రీ ఆంజనేయస్వామివారి జయంతిని టీటీడీ ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వాహనసేవలు నిర్వహించనున్నారు.

### తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో...

తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు.

ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామివారి మూలవర్లకు, శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు హనుమంత వాహనసేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తనుంది.

### శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో...

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఎదురు ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం 8 గంటల నుండి 8.30 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామివారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు.

### అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో...

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామివారి మూలవర్లకు అభిషేకం నిర్వహించనున్నారు.

### ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో...

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో



హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రీ సంజీవరాయస్వామివారి మూలవర్లకు, శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు హనుమంత వాహనసేవ వైభవంగా జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

# గంజి వాగు హై లెవెల్ వంతెన పనులు పూర్తి చేయాలి

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు : అక్కెనపల్లి కరుణాకర్**

**- ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేత**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్నసిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలోని గంజి వాగు వద్ద నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్కెనపల్లి కరుణాకర్ ప్రజల పక్షాన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదు నెలలుగా వంతెన పనులు నిలిచిపోయాయని, వర్షాకాలంలో గంజి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల ప్రజలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, రాజన్న భక్తులు, గర్భిణీలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అక్షనపల్లి మధుకర్, న్యాయవాది అక్కనపెల్లి అజయ్ కుమార్, ఎర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచారం

**- కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం దారుణం**

**- బండి సంజయ్ పై అసత్య ప్రచారాలు ఆపకపోతే చట్టపరమైన చర్యలు**

**- భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నేత : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కుటుంబంపై జరుగుతున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవేనని బీజేపీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు అనుమల్ల చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బండి సంజయ్ కుమార్ కుమారుడిని లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. రాజకీయ లాభాల కోసం కుటుంబ సభ్యులను వివాదాల్లోకి లాగడం సరైన విధానం కాదన్నారు. హిందుత్వం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బండి సంజయ్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ప్రత్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అసత్య ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజా ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

**- గంగాధర సర్పంచ్ : పడాల భాగ్యలక్ష్మి - రాజన్న**



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా,గంగాధర మండల కేంద్రంలో గొల్లపెల్లి లత-సత్తయ్య దంపతులు తెలంగాణ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి - రాజన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ

ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు పక్కా గృహాలు కల్పిస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ప్రభుత్వ సహకారంతో సామాన్య కుటుంబాలు సొంతింటిని నిర్మించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. తమ గృహప్రవేశానికి హాజరై గౌరవించిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి - రాజన్న దంపతులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్, కాంగ్రెస్ నాయకులు పొన్నం వెంకటేశం, మంత్రి మహేందర్, జంగిలి మహేష్, గంగాధర రమేష్ పాల్గొన్నారు.



## 'వారణాసి' లేటెస్ట్ షెడ్యూల్

# మళ్లీ మొదలైంది

### – సెట్స్ పై ప్రియాంక చోప్రా!

సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తాజా షెడ్యూల్ లో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. "వారణాసి, హియర్ వి గో!" అనే క్యాప్షన్‌తో ఆమె ఒక ఫోటోను పోస్ట్ చేయడంతో, కొత్త షెడ్యూల్ ప్రారంభమైనట్లు అధికారికంగా వెల్లడైంది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన షూటింగ్‌ను ఇప్పుడు పునఃప్రారంభించారు. తాజా అప్‌డేట్‌తో ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు మాధవన్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. కార్తికేయ, కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 ఏప్రిల్ 7న ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

# యథార్థ సంఘటనల దూరదర్శిని



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఫీల్‌గుడ్ లవ్ డ్రామా 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. ఎం.జయశంకర్‌రెడ్డి, పాటిమీది సంతోష్ నిర్మాతలు. ఈ నెల 15న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, పల్లెటూరిలో విహరించిన అనుభూతిని కలిగించే ఫీల్‌గుడ్ సినిమా ఇదని, మనసులకు హత్తుకునేలా, యువతకు, సమాజానికి నచ్చేలా సినిమా ఉంటుందని, 90ల నాటి గోల్డెన్ డేస్‌ని గుర్తు చేసే సినిమా ఇదని, పతాక సన్నివేశాలు ఆలోచింపజేస్తాయని దర్శకుడు కార్తికేయ కొమ్మి అన్నారు. 'అరుణాచల గిరిప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఓ పెద్దాయన బిక్షాటన చేస్తూ కనిపించాడు. సొంత కొడుకు వల్లే ఆయన బిక్షాటన చేస్తున్నట్టు ఆయన మాటల్లో తెలిసింది. అసలు కొడుకు వల్ల బిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఆయనకెందుకు వచ్చింది అనేదే ఈ కథ. ఈ సినిమా చూసి, కన్నీరు పెట్టనివారుండరు. అందుకే టికెట్‌తో పాటు ఖర్చీఫ్ కూడా ఇస్తున్నాం' అని హీరో సువిక్షిత్ చెప్పారు.

# 'బ్యాచ్ మేట్స్' సిరీస్ రివ్యూ!



కాలేజ్ నేపథ్యంతో కూడిన కంటెంట్ తో గతంలో చాలానే సిరీస్ లు వచ్చాయి. అలాగే ఇప్పుడు మరో సిరీస్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సిరీస్ పేరే 'బ్యాచ్ మేట్స్'. శ్రీహర్ష శెట్టి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, ఏప్రిల్ 30వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో మొదలైంది. ముందుగా 4 ఎపిసోడ్స్ ను స్ట్రీమింగ్ కి తీసుకొచ్చారు. ప్రతి గురువారం కొత్త ఎపిసోడ్స్ వదులుతూ వెళుతున్నారు. ప్రస్తుతం 8 ఎపిసోడ్స్ అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ లోని ఒక ఇంజనీరింగ్ కాలేజ్ లో సిద్ధార్థ్ .. మహేశ్ .. సంహిత .. గోల్డీ కొత్తగా జాయిన్ అవుతారు. సిద్ధార్థ్ తల్లి మాలారెడ్డి (భావన) ఒక డాక్టర్. కెరియర్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండమని ఆమె సిద్ధార్థ్ కి పదే పదే చెబుతూ ఉంటుంది. ఇంట్లో ఒక ఆత్మీయ పూర్వకమైన వాతావరణం లేకపోవడం, సిద్ధార్థ్ కి అసంతృప్తిని కలిగిస్తూ ఉంటుంది. కాలేజ్ లో స్నేహితుల కారణంగా అతను ఆ బాధను మరిచిపోతుంటాడు. కాలేజ్ లో సుహాస్ కి అంతా భయపడుతుంటారు. అతను సీనియర్ అని మాత్రమే కాదు, డీన్ కొడుకు కావడం మరో కారణం. కాలేజ్ లో రౌడీయిజం చెలాయిస్తూ అతను కాలక్షేపం చేస్తుంటాడు. సిద్ధార్ బ్యాచ్ కాలేజ్ లో చేరిన తొలి రోజులలోనే సుహాస్ తో గొడవ జరుగుతుంది. అప్పటి నుంచి అతను ఈ బ్యాచ్ ను టార్గెట్ చేస్తూ వేధిస్తుంటాడు. తన కారణంగా సంహిత .. గోల్డీ ఇబ్బంది పడుతుండటంతో, తమని వదిలేయమని సుహాస్ ను సిద్ధార్థ్ కోరతాడు. కాలేజ్ స్టాఫ్ రూమ్ లో .. ఫలానా ర్యాక్ లో ఉన్న ఒక కవర్ తీసుకొచ్చి తనకి ఇస్తే ఇక వాళ్ల జోలికి రానని సుహాస్ అంటాడు. తన బ్యాచ్ తో కలిసి ఒక రాత్రివేళ కాలేజ్ స్టాఫ్ రూమ్ లోకి వెళ్లిన సిద్ధార్థ్ ఆ కవర్ ను చేజిక్కించుకుంటాడు. ఆ కవర్లో మరునాడు జరగవలసిన ఎగ్జామ్ కి సంబంధించిన క్వశ్చన్ పేపర్స్ ఉంటాయి. ఆ తరువాత ఏం జరుగుతుంది? సిద్ధార్థ్ బ్యాచ్ ఎలాంటి పరిణామాలను ఫేస్ చేయవలసి వస్తుంది? అనేది మిగతా కథ. ఎక్కడెక్కడి నుంచో సిటీకి వచ్చి ఇంజనీరింగ్ కాలేజ్ లలో చేరేవాళ్లు ఉంటారు. రకరకాల ఫ్యామిలీ నేపథ్యాల నుంచి వచ్చిన స్టూడెంట్స్ పై ఆ ప్రభావం కనిపిస్తూ ఉంటుంది. చదువుకోవడం కోసం వచ్చిన స్టూడెంట్స్ కొందరైతే .. వాళ్లను చెడగొట్టడం కోసమే వచ్చినట్టుగా కనిపించేవారు మరికొందరు. ప్రేమ పేరుతో పెడతోవ పట్టేవారు కొందరైతే, అమాయకత్వం కారణంగా ఆవేదన చెందేవారు మరికొందరు. ఇక డబ్బు – అధికారం ఉన్నవారికి వత్తాసు పలికే యాజమాన్యం మరొకవైపు. ఇలా ఒక వైపున స్టూడెంట్స్ .. మరో వైపున యాజమాన్యం ధోరణి చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఈ కథలో ఎక్కువ భాగం ఇంజనీరింగ్ కాలేజ్ చుట్టూ తిరుగుతుంది. మధ్యమధ్యలో ఆయా స్టూడెంట్స్ ఫ్యామిలీ నేపథ్యాలను టచ్ చేస్తూ వెళ్లారు. అటు ఇంటి దగ్గర గానీ .. ఇటు కాలేజ్ లో గాని ఒక సరైన వాతావరణం లేనప్పుడు స్టూడెంట్స్ ఎలాంటి అయోమయానికి లోనవుతారు? అనే విషయాన్ని ఆవిష్కరించడానికి తమవంతు ప్రయత్నం చేశారు. కాలేజ్ లలో సీనియర్స్ ధోరణి ఎలా ఉంటుంది? కొత్తగా వచ్చిన స్టూడెంట్స్ పట్ల వాళ్లు ఎలా ప్రవర్తిస్తారు? ర్యాగింగ్ కారణంగా స్టుడెంట్స్ ఎలాంటి ఇబ్బందులు పడుతుంటారు? అనే విషయాలను ప్రెజెంట్ చేసిన విధానం బాగుంది. అలాగే యాజమాన్యం ఎవరికో కొమ్ము కాయడానికి ప్రయత్నించడం వలన, మిగతా స్టూడెంట్స్ జీవితాలు ఎలా 'బలి' అవుతాయనే విషయాన్ని ఆవిష్కరించారు. అయితే ఈ 8 ఎపిసోడ్స్ లోని కథవరకూ చూసుకుంటే, చాలా కాలంగా చూస్తూ వచ్చిన సన్నివేశాలే మళ్లీ మనకళ్ల ముందు కదులుతున్నట్టుగా అనిపిస్తుంది. లవ్ .. ఫ్రెండ్షిప్ కి సంబంధించిన సన్నివేశాలు కూడా చాలా నీరసంగా కొనసాగుతాయి. అలాగే కాలేజ్ రౌడీయిజం కూడా అంత ఎఫెక్టివ్ గా ఏమీ అనిపించదు. ఇక కామెడీ నవ్వించకపోగా కాస్త ఇబ్బంది పెడుతుందనే చెప్పాలి. 8 ఎపిసోడ్స్ మొత్తంగా చూసుకుంటే, చెప్పిన కథ చాలా తక్కువ. గతంలో చూసిన సన్నివేశాలని తిరగేసి మరగేసి సాగదీస్తూ వెళ్లారు. లవ్ .. కామెడీ .. ఫ్రెండ్షిప్ .. ఎమోషన్స్ ఏవీ కూడా కనెక్ట్ కాలేకపోయాయి. ఆర్టిస్టుల నటన కూడా అంతంత మాత్రంగానే అనిపిస్తుంది. ఆ పాత్రల ద్వారా ప్రేక్షకులను కథలోకి తీసుకుని వెళ్లలేకపోయారు.

సంభాషణలు కూడా చాలా పేలవంగా అనిపిస్తాయి. కృతకంగా అనిపించే సన్నివేశాలు, ఆడియన్స్ ను కథలో భాగం కాకుండా చేస్తుంటాయి. కథ .. కథనం .. పాత్రలను డిజైన్ చేసే విధానంలో .. ఆ పాత్రల నుంచి అవుట్ పుట్ ను రాబట్టే విషయంలో మరింత కసరత్తు చేసి ఉంటే బాగుండేది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఇంతవరకూ నడిచిన కథ అయితే రొటీన్. ఇక మిగిలిన ఎపిసోడ్స్ ఎలా ఉంటాయనేది చూడాలి.

# 'పెద్ది' ట్రైలర్ డేట్ ఫిక్స్..

### – మెగా మేనియాకు తెరలేచింది!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేయడంతో సోషల్ మీడియాలో సందడి మొదలైంది.('ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఒక రోజు ముందుగా, అంటే జూన్ 3న ప్రీమియర్ షోలు కూడా ప్రదర్శించనున్నారు. విభిన్నమైన కథాంశంతో, భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా సినిమాగా 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఇండస్ట్రీలో లింగ వివక్షపై కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు

భారతీయ చిత్ర పరిశ్రమలో దశాబ్దాలుగా కొనసాగుతున్న లింగ వివక్ష, పారితోషికాల అసమానతలపై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. గ్లామర్ ప్రపంచం వెనుక ఉన్న చేదు నిజాలను ఆమె ఎంతో ధైర్యంగా బయటపెట్టారు. చలనచిత్ర నిర్మాణంలో బడ్జెట్ పరిమితులు వచ్చినప్పుడు, నిర్మాతలు మొట్టమొదట హీరోయిన్ల పారితోషికాలకే కోతలు విధిస్తున్నారని కృతి ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా బడ్జెట్‌లో సింహభాగం హీరోల రెమ్యూనరేషన్‌కే వెళుతున్నప్పటికీ, ఖర్చు తగ్గించాలనే ఆలోచన రాగానే కేవలం హీరోయిన్ల దగ్గరే ఎందుకు మొదలుపెడతారని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో తాము ఎంతో పోరాటం చేయాల్సి వస్తోందని, నటీనటుల మధ్య ఈ స్థాయి వివక్ష చూపడం సరైనది కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. కేవలం పారితోషికాల విషయంలోనే కాకుండా, షూటింగ్ సెట్స్‌లో కూడా హీరోయిన్లు ఎదుర్కొంటున్న చిన్నచూపు గురించి కృతి ప్రస్తావించారు. హీరో సెట్‌లోకి రాకముందే హీరోయిన్ రెడీగా ఉందా లేదా అని పదేపదే తనిఖీ చేస్తారని, హీరో వెయిట్ చేయకూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి ఒత్తిడికి గురిచేస్తారని ఆమె పేర్కొన్నారు. నటీనటుల సమయానికి సమానమైన విలువ ఇవ్వకపోవడం చిత్ర పరిశ్రమలో ఉన్న లోతైన అసమానతలకు నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు. సమర్థవంతమైన నటనను ప్రదర్శిస్తూ, సినిమాల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, హీరోయిన్లను కేవలం అదనపు ఆకర్షణగా చూడటం మానేయాలని కృతి సనన్ విజ్ఞప్తి చేశారు. పారితోషికం, గౌరవం విషయంలో సమానత్వం ఉండాలని ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు, పరిశ్రమలోని ఇతర నటీమణుల నుంచి కూడా మద్దతు పొందుతున్నాయి.



# ప్రేమ గురించి భావోద్వేగాన్ని వ్యక్తం చేసిన నటి త్రిష



చెన్నై : ఫిల్మ్ స్టార్ త్రిష ఇవాళ తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష ఇవాళ తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాషన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది

## మోదీ ప్రభుత్వ విధానాలపై

# వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్ర విమర్శలు

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "బంగారం కొనొద్దు, పెట్రోల్ డీజిల్ కోసం ప్రజలు తిరగొద్దని చెప్పడం దేశ చరిత్రలో ఎప్పుడూ వినలేదని" అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రధానమంత్రి కూడా ఇలాంటి ఆంక్షల మాటలు మాట్లాడలేదని విమర్శించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. రూపాయి విలువ పతనానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని ఆరోపించారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయని, మొక్కజొన్న, పత్తి వంటి పంటలను కూడా దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు.డాలర్ విలువ పెరగడంతో దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత 12 సంవత్సరాల్లో భారీగా అప్పులు చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను ఏ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన హామీ ఏమైందో బీజేపీ ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. చైనాతో పోలిస్తే భారతదేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వల విషయంలో సరైన ప్రణాళికలు లేవని విమర్శించారు.దేశంలో బీజేపీ మతపరమైన రాజకీయాలు చేస్తోందని, ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అలాగే రేవంత్ రెడ్డి మరియు నరేంద్ర మోదీల మధ్య ఉన్న దోస్తానా ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ ఒక్కటేనని విమర్శించారు.రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల స్వప్న సురేష్, మామిడి శ్రీధర్, కాముని మురళి, మరికంటి కనకసేన, కప్ప మమతా సంతోష్, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణానికి కృషి చేసిన చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డికి ఘన సన్మానం



**కీసర( ప్రశ్న న్యూస్)** కీసర మండలంలో ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పిన హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావడంతో దేవాలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డిని సామాజిక సేవా కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు, సామాజిక సేవా కార్యకర్త, కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం భక్తి, ఆనందోత్సాహాల నడుమ సాగింది. ఈ సందర్భంగా తుడుం శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందే విధంగా హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణ మహోత్సవాలను నిర్వహించడం వెనుక చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి పట్టుదల, కమిటీ సభ్యుల అహర్నిశల శ్రమ కారణమని పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణం కేవలం ఒక నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా, భక్తుల విశ్వాసాలను, ఆధ్యాత్మిక సంప్రదాయాలను మరింత బలపరిచే మహత్తర యజ్ఞంగా నిలిచిందన్నారు. పునర్నిర్మాణ కార్యక్రమం ప్రారంభం నుంచి మహోత్సవాల ముగింపు వరకు ప్రతి అంశాన్ని శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం, వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం, వేలాదిమంది భక్తులు పాల్గొనేలా సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు ఆలయ నిర్వహణ కమిటీ నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. అలాగే హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా చిట్యాల శ్వేత


**- హర్షం వ్యక్తం చేసిన ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు మెతుకు నర్సింలు**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** వీరనారి చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేతను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రభుత్వం నియమించడం పట్ల ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు ( టెంట్ ) మెతుకు నర్సింలు హర్షం వ్యక్తం చేశారు, సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షుడు మెతుకు నర్సింలు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వారసురాలిగా సామాజిక స్పృహ కలిగిన చిట్యాల శ్వేతకు పదవి దక్కడం రజక సామాజిక వర్గానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మహిళల హక్కుల పరిరక్షణలోనూ వారి సమస్యల పరిష్కారంలోనూ వారు చురుకైన పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## విద్యా వారోత్సవాలు ప్రారంభం

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టేబుల్ టెన్నిస్, మొబైల్ స్పీకర్ అందుబాటులోకి**



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి గజ్వేల్‌లో విద్యార్థుల కోసం టేబుల్ టెన్నిస్ మరియు మొబైల్ స్పీకర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు గజ్వేల్ పట్టణానికి చెందిన డాక్టర్ ఏ. నరేష్ బాబు, డాక్టర్ మీల శ్రీధర్, శ్రీ ఏ. రాజశేఖర్ రెడ్డి కళాశాలకు టేబుల్ టెన్నిస్‌ను అందజేశారు. అలాగే కళాశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం మొబైల్ స్పీకర్‌ను కొనుగోలు చేశారు.విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈ సదుపాయాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నికత్ అంజుమ్ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాలలో అడ్మిషన్లు పెంపొందించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలని సూచిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ఎడ్యుకేషన్ వీక్" ప్రారంభం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ఎడ్యుకేషన్ వీక్" కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి గంగిశెట్టి చందన రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 13వ వార్డు కౌన్సిలర్, అధ్యాపకులు, విద్యార్థినులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాల యాక్షన్ ప్లాన్‌ను అధికారికంగా విడుదల చేశారు. కళాశాలలో కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ప్రిన్సిపాల్ వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో భాగంగా నూతనంగా అభివృద్ధి చేసిన యోగ రూమ్, ఈ-క్లాస్‌రూమ్స్, స్టాఫ్ రూమ్, 45 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఇన్వర్టర్, యూపీఎస్ సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం మాట్లాడుతూ, ఈ-క్లాస్‌రూమ్స్‌కు అవసరమైన ప్రొజెక్టర్లు, యూపీఎస్ వ్యవస్థలు, కంప్యూటర్లు కళాశాల సమీకృత నిధులతో టీజీటీఎస్ సహకారంతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే యోగ రూమ్, ప్లే కోర్టులు, స్టాఫ్ రూమ్ ప్రత్యేక ఫీజు నిధులతో అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.విద్యార్థినుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు వాలీబాల్ కోర్ట్, టెన్నికోయిట్ కోర్ట్‌లను కూడా ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.అడ్మిషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాల వివరాలతో కూడిన అడ్మిషన్ పాంప్లెట్లు విడుదల చేశారు. ముఖ్యంగా ఏఈడీపీ కోర్సు, బి.ఎస్‌సి హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఎడ్యుకేషన్ వీక్ లక్ష్యాలు ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక ఫ్లెక్సీలు, పాంప్లెట్లు విడుదల చేసి పంపిణీ చేశారు. అనంతరం అతిథులు కళాశాల ఆవరణలో గులాబీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల విద్యా ప్రగతి, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థి సాధికారతకు కట్టుబడి ఉందని కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.

## తెలంగాణ జన సమితి

# ప్లీనరీ జయప్రదం చేయండి

**- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి పిలుపు**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి నాలుగవ రాష్ట్ర ప్లీనరీ సమావేశాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలతో సాధించుకున్నప్పటికీ, రాష్ట్రంలో ఆశించిన అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ జరగలేదని ఆయన విమర్శించారు. గత పాలకులు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసి, కాంట్రాక్టులు -- కమిషన్లు -- డబ్బు రాజకీయాలను ప్రోత్సహించారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ నిరంకుశ పాలన సాగించారని అన్నారు.తెలంగాణ ఉద్యమ సారథి ఆచార్య కోదండరాం నాయకత్వంలో 2018 ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించబడిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యాలతో పార్టీ ముందుకు సాగుతోందన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన "చదువు -- బోధించు -- సమీకరించు -- పోరాడు" అనే సందేశాన్ని, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని ఆచరిస్తూ ప్రజలను సంఘటితం చేస్తున్నామని తెలిపారు.ప్రజాస్వామిక, లౌకిక తెలంగాణ నిర్మాణం కోసం నిర్వహిస్తున్న ఈ నాలుగవ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని, ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని నీరుడి స్వామి పిలుపునిచ్చారు.

## బండి సంజయ్, ఆయన కొడుకు

# భగీరధ్ దిష్టిబొమ్మల దహనం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆయన కుమారుడు బండి భగీరథ్ పై చర్యలు తీసుకోవాలి అంటూ మేడ్చల్ లో బిఆర్ఎస్ నేతలు కదం తొక్కారు. బండి సంజయ్ తో పాటు ఆయన కుమారుడి భగీరథ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ వ్యవహారం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయన కొడుకు భగీరథ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ మైనర్ బాలికపై అత్యాచారం చేసి తప్పించుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని ఆరోపించారు. పేట్ బషీర్బాగ్ పోలీస్ స్టేషన్లో బాధిత మహిళ ఫోక్సో కేసు పెట్టాలని కోరినప్పటికీ పోలీసులు నిరాకరించడం అన్యాయమని,ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ నిందితుడు బండి భగీరథ్ కు స్టేషన్ బెయిల్ రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సభ్య సమాజ తలదించుకునేలా ఉన్న ఈ సంఘటనతో బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, అయిన కొడుకు బండి భగీరథ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్లు నిషిత రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు దయానంద్ యాదవ్ అక్కిడి నవీన్ రెడ్డి, సుదర్శన్ గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మద్దుల శ్రీనివాస్ రెడ్డి, రఘుపతి రెడ్డి నడిగుప్పు నాగరాజు రాగజ్యోతి, చిట్టి మల్ల గణేష్, వెంకటేష్ హరిత్ రెడ్డి , వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 17 రద్దు చేసి చేవెళ్ల-కామారెడ్డి

# డిక్లరేషన్ అమలు చేయాలి

**- టెండర్లలో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్**

**- కలెక్టరేట్ ముందు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ అసోసియేషన్ నిరసన**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ కాంట్రాక్టర్లకు అన్యాయం చేస్తున్న జీవో నంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్, అకినపల్లి శిరీష, మేకల రవీందర్, జన్ను స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వ రంగ విద్యాసంస్థల టెండర్లలో స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. టెండర్లను గుజరాత్‌కు చెందిన మఫ్పత్ లాల్ కంపెనీకి కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేసి, తెలంగాణకు చెందిన స్థానిక కాంట్రాక్టర్లకే టెండర్లు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెట్టపల్లి అనిల్, రాణా ప్రతాప్, బడుగు నవీన్, మహమ్మద్ అజీం, కళ్లేపల్లి అరవింద్, కళ్లేపల్లి తిరుపతి, రామగిరి తులసి, అకినపల్లి ప్రవీణ్, కళ్లేపల్లి రిషి, కొత్తూరి సతివక్, మారంపల్లి చరణ్ తదితరులు పాల్గొన్నారు

# ఫలించిన ఎమ్మెల్యే నసీర్ కృషి

**- నాట్కో సెంటర్ లో 14న పెట్ స్కాన్ ప్రారంభం**

**- దీనితోపాటు 130 పడకల క్యాన్సర్ బ్లాక్**

**- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్ క్యాన్సర్ రోగులకు నాట్కో వరం**



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ ఏర్పాటుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ చేసిన కృషి ఫలించింది. ఇప్పటికే క్యాన్సర్ వైద్యంలో రాష్ట్రానికే తలమానికంగా ఉన్న జీజీహెచ్ లోని నాట్కో సెంటర్ ఇకపై మరింత అధునాతన సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ కోసం గతంలో అసెంబ్లీలోనూ, వైద్యశాఖ మంత్రి వద్ద ఎమ్మెల్యే నసీర్ అనేక సార్లు విన్నవించారు. ఈ మేరకు నాట్కో విభాగంలో ఈ నెల 14వ తేదీన పెట్ స్కాన్ సెంటర్ ప్రారంభించనున్నారు. సోమవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పెట్ స్కాన్ ద్వారా ఎంత సమయంలో రిపోర్టులు వస్తాయి ? ఎలాంటి రోగాలను గుర్తించే అవకాశం ఉంటుంది ? ప్రతి రోజు ఎంత మందికి స్కాన్ చేసే సామర్థ్యం ఉంటుంది ? దీనికి సంబంధించిన సిబ్బంది వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రి నాట్కో సెంటర్ లో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 120 పడకలతో క్యాన్సర్ పేషెంట్లకు సేవలందిస్తున్నారని, తాజాగా మరో 130 పడకలను అందుబాటులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. గతంలో క్యాన్సర్ ను రాచపుండుగా నిలిచే వారని, ఈ వ్యాధికి గురైన రోగికి ఇక నయం కాదనే ఉద్దేశంతో ఉండేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీజీహెచ్ లో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రూ.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న పెట్ స్కాన్ ద్వారా ఏడాదిన్నరపాటు ఉచితంగా రోగులకు సేవలందించనున్నట్లు తెలిపారు. ఒక్కో స్కాన్ విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. ఈ నెల 14న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రజాప్రశ్న
హైదరాబాద్ మంగళవారం 12, మే 2026

# శేరిలింగంపల్లి అక్రమ నిర్మాణాలపై సూరన్న సమరశంఖం

**- అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు**

**- అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి అధికారుల అవినీతి అక్రమాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు ప్రధాన భవనాలపై ఇప్పటికే 'ప్రజావాణి'లో సూరన్న ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ కట్టడాల వల్ల ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కడమే కాకుండా స్థానిక ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మూడు భవనాల వ్యవహారంలో పక్కా ఆధారాలతో టౌన్ ప్లానింగ్ అధికారులకు



ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల హస్తం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి పై వస్తున్న అనేక ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించి, సదరు భవనాల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు వల్ల వ్యవస్థ భ్రష్టు పడుతోందని ప్రజావాణిలో అందిన అక్రమ భవనాల ఫిర్యాదులను బుట్టదాఖలు చేసిన అధికారులపై కూడా చర్యలు



తీసుకోవాల్సిన సూరన్న కమిషనర్ ను కోరారు. ఈ అక్రమాలపై సూరన్న రాజీలేని పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించకుంటే, బాధితుల పక్షాన నిలబడి అధికారుల అంతు చూసే వరకు సూరన్న





విశ్రమించిననీ హెచ్చరించారు. ఒక్కొక్క టౌన్ ప్లానింగ్ అధికారి కూడబెట్టిన కోట్లకొద్దీ అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని, అక్రమ నిర్మాణాల పునాదులు కదిలిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారుల అవినీతితో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంటే చూస్తూ ఊరుకోలేము. ముఖ్యంగా ఈ మూడు భవనాల విషయంలో కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలి. అవినీతి అధికారుల అండతో సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని కూల్చివేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిపై ఉక్కుపాదం మోపుతుంటే, శేరిలింగంపల్లి అధికారులు మాత్రం పాత పద్ధతుల్లోనే భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. సూరన్న నేతృత్వంలో సాగే ఈ పోరాటం ద్వారా, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారుల అసలు స్వరూపాన్ని బయట పెడతామన్నారు. ఇకనైనా అధికారులు తమ తీరు మార్చుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నాము.

# గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల పై చర్యలేవి.?

**- 200 గజాల స్థలంలో 8 అంతస్తులు, అక్రమ సెల్లార్**

**- టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనానికి కారణం మామూళ్లేనా.?**

**- జిహెచ్ఎంసి అధికారుల కనుసైగల్లోనే భారీ నిర్మాణాలు ఒక్కో నిర్మాణం వద్ద 10 లక్షలకు తగ్గేదే లేదట.?**

**- మీడియాని అడ్డం పెట్టుకొని చక్రం తిప్పుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

నాంపల్లి (ప్రశ్న న్యూస్) గోషామహల్ సర్కిల్-30 పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, ప్రజల ప్రాణాలు అన్నీ పక్కనబెట్టి బిల్డర్లతో చేతులు కలిపిన కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పేరు ఇప్పుడు గోషామహల్ సర్కిల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. "డబ్బు ఇస్తే ఏ అక్రమ నిర్మాణానికైనా సార్ గ్రీన్ సిగ్నల్" అనే స్థాయిలో వ్యవహారం నడుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

### 200 గజాల్లో 8 అంతస్తులు, అధికారులకు కనిపించలేదా.?



మంగళ్ హాట్‌లోని ప్రకాష్ టాకీస్ ఎదురుగా ఇంటి నెంబర్ 13-1-12/10 వద్ద సుమారు 200 గజాల స్థలంలో ఏకంగా 8 అంతస్తుల భారీ నిర్మాణం కొనసాగుతుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సుమారుగా 10 ఫీట్ల సన్నని గల్లీలో ఇంత భారీ నిర్మాణం ఎలా అనుమతించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికుల మాటల్లో చెప్పాలంటే "పర్మిషన్ కేవలం స్టిల్ ప్లేస్ టు కు మాత్రమే తీసుకొని ఏకంగా 8 అంతస్తులు నిర్మించారంటే డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్, ఏసీపీ బాలస్వామి, సెక్షన్ ఆఫీసర్ మహేందర్ అవినీతి ఎంత



తీవ్రస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ అంతస్తులు, నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు, భవిష్యత్తులో గోదాములుగా ప్రమాదకర నిర్మాణాలు" అన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయట.

ఇంత భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఒక నోటీసు కూడా ఇవ్వకపోవడం పై అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా పేదవాడు చిన్న ఇల్లు వేసుకున్నా నిబంధనల పేరుతో వెంటనే కూల్చివేత లు చేసే మున్సిపల్ సిబ్బంది అధికారులు, ఇక్కడ మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షల వసూళ్లా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం ఇదే గల్లీలో అనేక సెల్లార్లతో అక్రమ నిర్మాణాలకు జరుగుతుంటే స్థానికుల ఫిర్యాదులను పక్కనబెట్టడం, చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు



ఫైళ్లు క్లోజ్ చేయడం కోసం సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారు అని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఒక్కో నిర్మాణం నుంచి రూ.10 లక్షలకుపైగా వసూల్ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గోషామహల్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల సంఖ్య తీవ్రంగా పెరగడానికి ప్రధాన కారణం అధికారులకు భారీగా ఇస్తున్న మామూళ్ల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### డబ్బు ఇస్తే చాలు, ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చు

సెక్షన్ ఆఫీసర్ మహేందర్ ఏసీబీ బాలస్వామి కి మామూళ్లు ఇస్తే ఎన్ని అంతస్తులైన కట్టుకోవచ్చునే ధైర్యం బిల్డర్లకు ఎక్కడి నుంచి వస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేకపోవడం వెనుక పెద్ద స్థాయి అవినీతి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఏసీపీ, డిప్యూటీ కమిషనర్ మౌనం వెనుక వాటాల వ్యవహారమా.?

మంగళ హాట్ లోని ప్రకాష్ టాకీస్ దగ్గర భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్రపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. "సెక్షన్ ఆఫీసర్ మహేందర్ స్థాయిలో ఇంత



భారీ అక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు తెలియకుండా ఎలా ఉంటుంది.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏసీపీ, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు కూడా వాటాలు అందుతున్నాయా.? అందుకే చర్యలు తీసుకోవడం లేదా.? మరి గోల్కొండ జోనల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కూడా ఎందుకు మౌనంగా ఉన్నారు.? అనే చర్చ స్థానికులలో జోరుగా సాగుతోంది. అక్రమ నిర్మాణాలపై మీడియా కథనాలు వస్తున్నా, ఫిర్యాదులు అందుతున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు వెళ్లి పరిశీలించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు "చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణమేంటి.?" అని ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమ సెల్లార్లు, అక్రమ అంతస్తులు, అక్రమంగా గోదాములలో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే **బాధ్యత ఎవరిది.?**

ఇరుకైన గల్లీలు, పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న అత్యంత భారీ భవనాలు భవిష్యత్తులో పెను ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అక్రమ సెల్లార్లలో గోదాములు నిర్వహిస్తే అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ ఇంజన్లు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి, ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి గోషామహల్ సర్కిల్-30 పరిధిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ ప్రాంతం అక్రమ నిర్మాణాల కేంద్రంగా పూర్తిస్థాయిలో మారిపోతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# గృహహింస కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**- బెయిల్ తిరస్కరించిన సుప్రీంకోర్టు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భార్యను ఏ భర్త కూడా పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే సర్వ హక్కులు ఉన్నాయని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. అంతకుముందు పాట్నా హైకోర్టు కూడా అతని బెయిల్‌ను తిరస్కరించింది. నిందితుడు మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడని బాధితురాలు తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైందని అన్నారు. ఆ తర్వాత కర్రతోనూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు మూడు వివాహాలు చేసుకున్నాడని కోర్టుకు తెలిపారు. ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు అతడి మొదటి భార్య. బాధితురాలి వాదనలు విన్న న్యాయస్థానం, "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు? ఇలాగే వేధిస్తే ఆమె మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది కదా. మీరు రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అని సూచించింది. నిందితుడి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది.

# త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్'

**- వెల్లడించిన ఎన్నికల సంఘం**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాబోయే కొద్దిరోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడవ దశను ప్రారంభిస్తామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ, మిగిలిన 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్' ఉంటుందని వెల్లడించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మూడో దశకు సమాయత్తమవుతుంది. ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 'ఎస్ఐఆర్' చేపట్టారు. అసోంలోనూ ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగింది. మొత్తం దేశంలోని 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి, ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పై రాష్ట్రాలకు ఫిబ్రవరి 19వ తేదీన ఈసీ లేఖ రాసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాల వల్ల బ్రేక్ పడింది. వాటితో పాటు ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్ళడం కూడా జాప్యానికి కారణమైంది.

# ఇది వైఫల్యానికి నిదర్శనం

**- బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ " మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.

**- ప్రధాని విజ్ఞప్తి ఇదే..**

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588